# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 140 ప్రకాశం, గురువారం 19- 02 - 2026 పేజీలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## శుభాల రంజాన్ మాసానికి స్వాగతం,పవిత్ర మాసం సద్దుద్దేశాన్ని చాటిచెబుదాం,..

## వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్,



**క్రైమ్ కౌంటర్ న్యూస్... మార్కాపురం జిల్లా....** శుభాల రంజాన్ మాసానికి స్వాగతం చెబుదాం...ఈ పవిత్ర మాస సద్దుద్దేశాన్ని యావత్తు సమాజానికి చాటిచెబుదామని వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ పిలుపునిచ్చారు. రంజాన్ మాసం ప్రారంభం నేపథ్యంలో ఆయన తన సందేశాన్ని వ్యక్తంచేశారు. రంజాన్ మాసంలో ముస్లింలు పాటించే ఉపవాస దీక్ష ఉద్దేశం పేదోడి ఆకలి బాధను అర్థంచేసుకొనేందుకేనని ఆయన పేర్కొన్నారు. పేదోడి ఆకలి తీర్చి రంజాన్ మాసంలో పాటించే శాంతియుత జీవన విధానం మిగితా పదకొండు మాసాలు పాటించేలా ప్రేరేపించడమే ఈ పవిత్ర మాసం ఉద్దేశమని ఆయన వెల్లడించారు. ఈ సందేశాన్ని ప్రతి ఒక్క ముస్లిం యావత్తు సమాజంలో బలంగా తీసుకెళ్లి మన దేశ భిన్నత్వంలో ఏకత్వం కోసం పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. మంచి సందేశాన్ని పాటించడమే కాదు వాటిని యావత్తు సమాజానికి తెలియజేస్తేనే సమసమాజ లక్ష్యం, ఆకలి లేని రాజ్యం, శాంతియుత జీవన విధాన సమాజం ఏర్పాటుకు కారణమవుతుందని ఆయన వెల్లడించారు.

## ఉర్దూ అకాడమీ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం



**ఒంగోలు క్రైంకౌంటర్ ప్రతినిధి,**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ప్రచురించిన ప్రత్యేక క్యాలెండర్లను ప్రకాశం జిల్లా విద్యా శాఖాధికారి సి వి రేణుక బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాలెండర్ ద్వారా ప్రసిద్ధ ఉర్దూ రచయితలు, కవులను పరిచయం చేయడమే కాకుండా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వర్ణ చిత్రాల ద్వారా ప్రజానీకానికి పరిచయం చేయడం బాగుందన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ సరికొత్త తీరుతెన్నులతో ఇటు ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేయడం మాత్రమే కాకుండా ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల మీద ప్రచురితమైన తెలుగు భాషలోని గ్రంథాలను ఉర్దూ భాషలోకి అనువదించడం శుభపరిణామం అన్నారు.ఆ గ్రంథాలను ప్రచురించేందుకు అడుగులు వేయడం ఆహ్వానించదగిన నిర్ణయమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలోటి ప్రముఖ సామాజిక సేవకులు ఎం.ఏ.సాలార్, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా, షేక్ రహంతుల్లా, జర్నలిస్ట్ షేక్ నాసిర్ తదితరులు పాల్గొన్నారు.


## జేఈఈ మెయిన్స్‌అద్భుత ఫలితాలు

### శ్రీ గాయత్రి ఐఐటి మెడికల్ అకాడమీ విద్యార్థులు




**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,**జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఫలితాలలో కందుకూరు శ్రీ గాయత్రి ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి కొనిదెన ధనుష్ 97.584, నెక్కంటి రాకేష్ 91.6312 పర్సంటేజ్ తో అత్యుత్తమ ఫలితాలు సాధించామని గాయత్రి విద్యాసంస్థల అధినేత సిహెచ్ రామకృష్ణారావు, డైరెక్టర్ సిహెచ్ భరద్వాజ్ తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులను వారి తల్లిదండ్రులను, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందిని శ్రీ గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ సిహెచ్ రామకృష్ణ రావు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వి ఉషా చంద్రిక , ఐఐటి అకాడమీ డీన్ ×. వెంకటేశ్వర్లు , జి 1 క్యాంపస్ డీన్ పాతూరి వెంకటేశ్వర్లు అభినందించారు.

## చర్మ వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు -డాక్టర్ పి. ప్రసాద్ రావు



**క్రైం కౌంటర్ ప్రతినిధి కందుకూరు రూరల్,** రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాల చర్మ వ్యాధుల డాక్టర్ పి. ప్రసాద్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తామర, సోయాసిస్, బొల్లి, పేను కొరుకుడు, మోశీగు తదితర వ్యాధులకు వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. రోజు ఎక్కడ దాదాపు 50 మంది రోగులు వైద్య సేవల కొరకు వస్తున్నారు.కందుకూరు పరిసర ప్రాంతాల నుంచి పి ఆర్ పి కొరకు ఒంగోలు, నెల్లూరు తదితర ప్రాంతాలకు వెళ్లి ఒక్కొక్కరికి ఐదుసార్లు కలిపి వేలాది రూపాయలను ఖర్చు చేస్తున్నారని చెప్పారు.




**క్రైమ్ కౌంటర్ న్యూస్ ఫ్యామిలీ తరపునుంచి**రంజాన్ పవిత్ర మాసం మీ జీవితాలలో కొత్త వెలుగు నింపాలని.ఆ అల్లా ఆశీస్సులతో మీ ఇంటిల్లిపాది సుఖ సంతోషాలను వర్ధిల్లాలని కోరుకుంటూ రంజాన్ మాస ప్రారంభ శుభాకాంక్షలు...

నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు, ప్రార్ధనలు,ఖురాన్ పఠనంతో గడిపే ముస్లిం సోదర,సోదరీమణులకు రంజాన్ నెల ప్రారంభోత్సవ శుభాకాంక్షలు...

షేక్, షఫీ

క్రైమ్ కౌంటర్ రిపోర్టర్

## మైనర్ కాలువ ఆక్రమించి వెంచర్

### నిబంధనలు బేఖాతర్

### అధికారుల తీరుపై అనుమానాలు

### సాగునీటి ప్రవాహం ఎలా అన్న ఆందోళనలో రైతులు



**క్రైం కౌంటర్ న్యూస్ :**అద్దంకి, ఫిబ్రవరి 18 సాగునీటి కాలువను ఆక్రమించి వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పంట పొలాలకు నీరు ఎలా చేరుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనల ప్రకారం సాగునీటి కాలువలు ఉన్న ప్రాంతాలలో ముందస్తు అనుమతులు తీసుకోకుండా వెంచర్‌లు, నిర్మాణాలు చేయకూడదు. అవేమీ పట్టించుకోకుండా వెంచర్‌ను వేస్తున్నప్పటికీ అధికారులు మిన్నకుండటం విమర్శలకు తావిస్తోంది. అద్దంకి మండలంలోని రామాయపాలెం రెవెన్యూ పరిధిలో అద్దంకి-దర్శి రోడ్డు వెంబడి ఇటుక బట్టీ సమీపంలో కొత్తగా వెంచర్ ఏర్పాటు చేస్తు న్నారు. పచ్చని పొలంలో పంట యథావిధిగా ఉంచి వెంచర్‌కు అవసరమైన రోడ్డు, సైడ్ డ్రైన్‌లు నిర్మిస్తున్నారు. వెంచర్ మధ్యలో గుండా మోదేపల్లి మేజర్‌లో తిమ్మాయపాలెం పొలాలకు వచ్చే ఎల్-2 మైనర్ కాలువ ఉంది. వెంచర్‌లో వేసే అంతర్గత రోడ్లతో మైనర్ కాలువ, డ్రాప్‌లు పూర్తిగా కనుమరుగవుతున్నాయి. ఇప్పటికే కాలువ ఉండే ప్రాంతంలో గ్రావెల్ రోడ్ల నిర్మాణం పూర్తయింది. సాగునీటి కాలువలు ఉన్న చోట రెవెన్యూ, పంచాయతీ అధికారులు వెంచర్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అధికారుల మీనమేషాలు

మైనర్ కాలువను ఆక్రమించి యథేచ్ఛగా వెంచర్ ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఎన్‌ఎస్‌పీ అధికారులు మీనమేషాలు లెక్కించడాన్ని రైతులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. గతంలో మోదేపల్లి మేజర్ చివరి ఆయకట్టుకు దశాబ్దాల తరబడి నీటి విడుదల జరగకపోవడంతో కాలువలు ఆక్రమణలకు గురవుతున్నా రైతులు పెద్దగా పట్టించుకోలేదు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి చివరి ఆయకట్టుకు నీటి విడుదల జరిగేలా కృషి చేశారు. దీంతో భవిష్యత్‌లో కూడా మెట్ట పంటలకు సాగునీరు సరఫరా జరుగుతుందనే భరోసా రైతులకు కలిగింది. ప్రస్తుతం మైనర్ కాలువను పూర్తిగా ఆక్రమించి వెంచర్ వేచి రోడ్లు నిర్మిస్తున్నందున సాగునీటి సరఫరాకు అవకాశం ఉండదు. దీంతో పంట పొలాలు బీడు భూములుగా మారే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మైనర్ కాలువ ఆ క్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టడంతోపాటు కాలువ పునరుద్ధరించి సాగునీటి ప్రవాహం జరిగేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## అజిత్ పవార్ విమాన ప్రమాదం రోజే 75 ఫైళ్ల క్లియరెన్స్‌పై వివాదం

**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 18**ముంబై: ఎన్‌సీపీ నేత అజిత్ పవార్ ఇటీవల విమాన ప్రమాదంలో మరణించడంపై ఆ పార్టీ నేతల్లో ఇప్పటికీ అనుమానాలు వ్యక్తవుతున్నాయి. విమాన ప్రమాదంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ ఎన్‌సీపీ ఒక విజ్ఞాపన పత్రాన్ని కూడా ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌కు అందజేసింది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ కీలక విషయం వెలుగుచూసింది. అజిత్ పవార్ విమానప్రమాదానికి గురైన జనవరి 28న కీలకమైన అడ్మినిస్ట్రేటివ్ నిర్ణయం జరిగింది. మైనారిటీ స్కూళ్లకు సంబంధించిన 75కు పైగా ఫైళ్లను మహారాష్ట్ర మైనారిటీ శాఖ క్లియర్ చేసింది. మైనారిటీ విద్యా సంస్థల గుర్తింపు, ఆమోదానికి సంబంధించిన ప్రపోజల్స్ కలిగిన ఫైళ్లు ఇందులో ఉండటం సంచలనమవుతోంది. ఈ పరిణామం రాజకీయ, అడ్మినిస్ట్రేటివ్ సర్కిల్స్‌లో అనేక ప్రశ్నలకు తావిస్తోంది. ఇంత పెద్ద సంఖ్యలో ఫైళ్లను ఒకే రోజులో క్లియర్ చేయడం వెనుక అవకతవకలు జరిగినట్టు విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఇంత స్వల్ప వ్యవధిలో పెద్ద మొత్తంలో ఫైళ్లు క్లియర్ చేయడం అనుమానాలకు తావిస్తోంది. సరైన విధివిధానాలు, స్క్రూటినీపై అనుమానాలున్నాయి' అని విపక్ష నేత ఒకరు అన్నారు. కాగా, ఈ వివాదంపై ప్రభుత్వం తక్షణ విచారణను చేపట్టింది. మహారాష్ట్ర మైనారిటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ మిలంద్ షెనోయ్‌ను బదిలీ చేసింది. ప్రభుత్వ విచారణ తర్వాతే పూర్తి వివరాలు బయటకు వస్తాయని అధికారులు చెబుతున్నారు.



# ఫార్మా, లీ హెల్త్ డొమైన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- ఎముకల పటిష్టతపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి
- ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి








**క్రైమ్ కౌంటర్ న్యూస్....** విశాఖపట్నం: ప్రతి ఒక్కరు ఎముకల పటిష్టతపై శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉండే విధంగా శరీరానికి కావాలసిన పోషకాలు తప్పనిసరిగా తీసుకోవాలని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి అన్నారు. లీ ఫార్మా, లీ హెల్త్ డొమైన్ సంయుక్తంగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌తో కలిసి బుధవారం మాల్ ఉద్యోగుల కోసం ఉచిత ఎముకలు, కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. ఈ వైద్య శిబిరం ద్వారా సుమారు 300 మంది లబ్ధి పొందారు. వీరికి హ్యాండ్ గ్రిప్, బిఎమ్ఐ, హెచ్.బి, ఆర్.బి.ఎస్, బి.పి, ఎముక ఖనిజ సాంద్రత, బాడీ కంపోజిషన్ వంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం డాక్టర్.. న్యూట్రిషనిస్ట్ నివేదికలను పరిశీలించి, ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో చేసుకోవాల్సిన మార్పుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్లు సరోజిని, జయలక్ష్మి, న్యూట్రిషనిస్ట్ లు డాక్టర్ రాధిక, మాధురి, క్రాంతి, జీఎన్ఎం భాగ్యలత, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ రీజనల్ మేనేజర్ నవీన్, లీ ఫార్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు......







**క్రైమ్ కౌంటర్ న్యూస్.... మార్కాపురం జిల్లా...** మార్కాపురంలో శ్రీరామ్ చిట్స్ అధికారుల దౌర్జన్యకాండ కోర్టు జడ్జిమెంట్ ఉందని చెప్పిన లెక్కచేయని కంపెనీ సిబ్బంది మార్కాపురం ఫిబ్రవరి 18 మార్కాపురం పట్టణంలోని 10 అవార్డు స్థానిక జగదీశ్వరి టాకీస్ సమీపంలో బుధవారం నాడు శ్రీరామ్ చిట్స్ ఫైనాన్స్ కంపెనీ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇంటి గోడకు నోటీసులు అంటించారు. ఇంటి కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండంగానే వాళ్లకి చెప్పకుండా నోటీసులు అంటించబోతే అడ్డుకోబోయిన ఇంటి యజమాని, అయినప్పటికీ నలుగురు వ్యక్తులు శ్రీ రామ్ ఫైనాన్స్ కంపెనీ నుండి వచ్చామని లోన్ తీసుకున్నారని అందుకు ఇంటికి నోటీసులు అంటించారు.. వారికి ఎటువంటి కోర్టు ఉత్తర్వులు లేకుండానే బలవంతంగా దౌర్జన్యంగా ప్రవర్తించారు. వాస్తవంగా ఇంటి యజమానికి 2018 లో గౌరవ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జ్ గారి కోర్టు ఉత్తర్వులు ఇంటి యజమానికి, అనుకూలంగా ఉన్నాయి మరియు 2020 లో ఓ ఎస్ నెంబర్ 250/2014 2020 మార్చి 5వ తారీఖున సీనియర్ సివిల్ కోర్టు జడ్జిమెంట్ ఉత్తర్వులు కూడా ఉన్నాయని చెబుతున్నప్పటికీ దౌర్జన్యంగా కంపెనీ ఉద్యోగులు ఖాతారుచేయకుండా అలాంటి కోర్టు ఆర్డర్లు ఎన్నో చూసామని ఇప్పటినుండి ఈ ఇల్లు శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ పరిధిలోకి వస్తుందని ఇల్లు ఖాళీ చేయాలని హెచ్చరించారు. కాగా ఇంటి కుటుంబ సభ్యులు మా ఇంటిపై దౌర్జన్యంగా నోటీసులు అంటించి బజారు మొత్తం తెలిసే విధంగా పరువు నష్టం కలిగించి ఇంటిలో సీనియర్ సిటిజన్స్ ఉన్నారని తెలిసి కూడా దౌర్జన్యంగా వాళ్ళ ఇష్టానుసారంగా ప్రవర్తించి ఇది కంపెనీ అధీనంలో ఉందంటూ హెచ్చరికలు జారీ చేశారు వాస్తవంగా లోన్ తీసుకున్నది ఒకరు కానీ మరొకరి ఇంటికి వచ్చి ఎలాంటి సమాచారం లేకుండా ఎలాంటి కోర్టు ఉత్తర్వులు లేకుండా దౌర్జన్యంగా ప్రవర్తించడం ఎంతవరకు సబమని ఇంటి యజమాని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. దీనిపై విచారించి పోలీస్ వారు తగిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.....

# కరేడు బాలికల ఆశ్రమ పాఠశాలకు మైక్ సెట్ ను అందజేసిన విశ్రాంత పిఈటి సుబ్బారావు



**ఉలవపాడు, క్రైశీకౌంటర్ ప్రతినిధి,** మండలం లోని కరేడు గ్రామంలో ఉన్న గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా సుమారు 20 వేల రూపాయలు విలువచేసే మైక్ సెట్ ను విశ్రాంత పిఈటి సిహెచ్ వి సుబ్బారావు వారి ధర్మపత్ని సుశీలమ్మ పేరుతో ప్రిన్సిపల్ జి గోవర్ధని కి అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావును పాఠశాల ప్రిన్సిపల్ గోవర్ధని పాఠశాల విద్యార్థుల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం సుబ్బారావును పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాలుర ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ ఏ మధుసూదన్ బాబు, నల్లధరపూరు ప్రధానోపాధ్యాయులు బి మాధవరావు, జి శ్రీనివాసులు, జి సమతా తదితరు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫ్లైట్ టికెట్టూ నాదే.. మ్యాచ్ టికెట్టూ నాదే!".. పుష్ప స్టైల్‌లో లోకేశ్ సెటైర్



**క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 18** శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన భారత్–పాకిస్థాన్ టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించిన ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌పై కొందరు విమర్శలు గుప్పించారు. ఈ మ్యాచ్‌కు వెళ్లడానికి ప్రభుత్వ నిధులను భారీగా ఖర్చు చేశారని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఈ ఆరోపణలను లోకేశ్ తీవ్రంగా ఖండించారు. భారత జట్టుకు మద్దతుగా టీమిండియా జెర్సీ ధరించి, త్రివర్ణ పతాకంతో స్టేడియంలో ఉత్సాహంగా కనిపించిన లోకేశ్, మ్యాచ్ అనంతరం తన అనుభవాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు.

ఈ విమర్శలపై పుష్ప స్టైల్‌లో వ్యంగ్యంగా స్పందించిన లోకేశ్, "ఫ్లైట్ టికెట్టూ నాదే! మ్యాచ్ టికెట్టూ నాదే! నా దుడ్లతో నేను మ్యాచ్ చూస్తిని.. నీ దుడ్లు ఏమైనా ఖర్చు చేస్తినా జగన్?" అంటూ పోస్ట్ చేశారు. తన సొంత డబ్బుతోనే ఈ పర్యటన చేశానని, ప్రజాధనం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని స్పష్టం చేశారు. ఈ సెటైర్ వైరల్ అయ్యింది.

ఈ విషయంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ కూడా స్పష్టత ఇచ్చింది. లోకేశ్ పర్యటనకు సంబంధించి ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదని ధృవీకరించింది. అన్ని ఖర్చులు మంత్రి సొంత ఖర్చులతోనే జరిగాయని తెలిపింది. దీంతో ఆరోపణలు అవాస్తవమని నిరూపితమైంది.

ఈ ఘటన రాజకీయ విమర్శలు, సోషల్ మీడియా ప్రచారాల మధ్య జరుగుతున్న వాదనలకు మరో ఉదాహరణగా నిలిచింది. లోకేశ్ స్పందన ద్వారా ప్రజాధన వినియోగంపై పారదర్శకతను నొక్కి చెప్పారు.

# ముగిసిన రామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**క్రైమ్ కౌంటర్ న్యూస్..** ఓర్వకల్లు, ఫిబ్రవరి 18 మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఆలయ ఈవో మద్దిలేటి ఆధ్వర్యంలో వేదపండితులు జం ధ్యాల ప్రసాద్‌శర్మ, ఆలయ ప్రధానఅర్చకులు కల్లె లక్ష్మీ నారాయణ శర్మ స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. ఆలయ ఈవో మద్దిలేటి, ఆలయ చైర్మన కాటినేని నారాయణ, ధర్మకర్త కాకి దేవేంద్ర దంపతులు హోమంలో పాల్గొన్నారు. ఉదయం వసంతోత్సవం, సాయంత్రం పార్వేట కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణాహుతి, సుగంధ ద్రవ్యాలు, దాన్యం, పూజా సామాగ్రిని హోమగుండానికి సమర్పించి మొక్కులు చెల్లించుకు న్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.






# పశువుల ఆసుపత్రుల్లో.. మందుల కృత్రిమ కొరత..!?

**ప్రైవేటు మందుల షాపుల్లో కొనమంటూ చీటీలు**
**వేలాది రూపాయల ఖర్చు..**
**పశు రైతులు.. పెంపుడు జంతువుల యజమానుల గగ్గోలు**
**కమిషన్ల కోసమే బయటకు రాస్తున్నారంటూ ఆరోపణలు**

**క్రైం కౌంటర్ న్యూస్ :** ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 18 పశువైద్యశాలల్లో మందుల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారంటూ పాడిపశు రైతులు, పెంపుడు జంతువుల యజమానులు ఆరోపిస్తున్నారు. అనారోగ్యంగా ఉన్న మూగ జీవాలను పశువుల ఆసుపత్రికి తీసుకెళ్తే జేబులు ఖాళీ అవు తున్నాయని వాపోతున్నారు. చిన్నపాటి అనారోగ్యాల బారిన పడ్డ పశువులు, పెంపుడు కుక్కలకు వైద్యం పేరిట వేలాది రూపాయల మందులను ఆసుపత్రి పక్కనే ఉన్న ప్రైవేటు మందుల షాపుల్లో డాక్టర్లు కొనుగోలు చేయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మందులు ఇవ్వరా.. అని అడిగితే 'మీకు కావాల్సిన మందులు అయిపోయాయని, బయట కొనుక్కొండి' అని వైద్యులు సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏలూరు ప్రాంతీయ పశువుల ఆసపత్రికి రోజుకు వంద నుంచి 150 పెంపుడు కుక్కలు, ఆవులు, గేదెలు, 10--20, మేకలు, గొర్రెలు 20--30 వరకు చికిత్స నిమిత్తం తీసుకొస్తుంటారు. జిల్లాలో అత్యధికంగా చికిత్సకు వచ్చే పశువుల ఆసుపత్రి ఇదే. ఇక్కడ మందులు ఉచితంగా ఇవ్వరనే విమర్శలున్నాయి. ప్రతి పెంపుడు కుక్కకు, పశువులకు ఒక్కొదానికి రూ.వెయ్యి నుంచి 2, 3 వేల వరకు మందులు, ఇంజక్షన్లు బయటకు రాస్తున్నారని, రక్త పరీక్షలు చేయడానికి జిల్లా ఆసుపత్రిలో లేబరేటరీ ఉన్నా బయట ప్రైవేటు ఆసుపత్రిలో చేయించుకు రావాలని చెబుతున్నారని పశు రైతులు వాపోతున్నారు. దీంతో రెండు, మూడు కిలోమీటర్లు వెళ్లి రూ.ఐదు వేలక పైగా చెల్లించి రక్తపరీక్షలు చేయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేసున్నారు. జిల్లాలో ప్రతి పశువుల ఆసుపత్రిలోను ఇదే విధంగా ప్రైవేటు లేబరేటరీలు, మందుల షాపులకు రాసి సిబ్బంది కమిషన్లు పొందుతున్నారని వారు ఆరోపిస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి జిల్లాలోని పశువుల ఆసుపత్రులకు కోటి 50 లక్షల విలువైన మందులు అందజేస్తుంది. వీటిని ఆయా ఆసుపత్రులకు అవసరం ఉన్న మందులను జిల్లా కేంద్రం నుంచి సరఫరా చేస్తారు. కాని ఏ ఆసుపత్రిలోనూ ఉచితంగా ప్రభుత్వం ఇచ్చిన మందులు ఇవ్వడం లేదని, ప్రభుత్వం నుంచి వచ్చిన మందులు ఏమైపోతున్నాయని రైతులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో వెటర్నరీ ఆసుపత్రులు 11, వెటర్నరీ డిస్పెన్సరీస్ 66, రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్లు 57 ఉన్నాయి. జిల్లాలో అ?ధికారిక గణాంకాల ప్రకారం ఆవులు లక్షా 21వేల 574, గేదెలు 4లక్షల 80వేలు, గొర్రెలు 5,71,231, మేకలు 2,34,793 ఉన్నాయి. జిల్లాలో పశువుల ఆసుపత్రుల్లో జరుగుతున్న మందుల అవినీతిపై విచారణ చేసి మందులు ఉచితంగా అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉచితంగా మందులు ఇవ్వాలి

వారం రోజుల నుంచి మా పెంపుడు కుక్కకు నలతగా ఉంది. నాలుగు రోజుల నుంచి ఆసుపత్రికి తీసుకొస్తున్నాం. ఏవో ఇంజన్లు రాశారు. బయట మెడికల్ షాపులో కొంటే రూ.600 అయ్యాయి. మళ్లీ రక్త పరీక్షలు చేయాలని బయట లేబరేటరీకి రాశారు. అక్కడ రూ.500 చెల్లించాం. రిపోర్టు చూసి బయటకు మందులు రాయడంతో వాటిని కొనేందుకు వేలాది రూపాయలు ఖర్చయ్యాయి. మా లాంటి సామాన్యులకు ఇది భరించలేని వ్యయం. ప్రభుత్వమే ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలి.

సీహెచ్.లక్ష్మణరావు, శ్రీరామవరం

మందుల కొరత లేదు

పశువుల ఆసుపత్రిలో మందుల కొరత లేదు. పెంపుడు కుక్కలకు, పశువులకు అవసరమైన మందులు ఇస్తున్నాం. ఏమైనా మందులు లేకపోతేనే బయట షాపులకు రాస్తున్నాం. జిల్లా కేంద్ర కార్యాలయంలో అత్యాధునిక లేబరేటరీ ఉంది. రక్త పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తున్నాం. బయట లేబరేటరీలకు రక్త పరీక్షలకు సిపార్సు చేయడం లేదు.

# 25న వెలిగొండకు సీఎం

**క్రైం కౌంటర్ న్యూస్ :** పెద్దదోర్నాల, ఫిబ్రవరి 18 ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 25న వెలిగొండ ప్రాజెక్టును సందర్శించనున్నారు. పెద్దదోర్నాల మండలంలోని కొత్తూరు, గంటవానిపల్లె గ్రామాల వద్ద జరుగుతున్న ఫీడర్ కెనాల్ ఆధునికీకరణ, టన్నెల్ పనులను పరిశీలించనున్నారు. ఈమేరకు ఆయన పర్యటన ఖరారైంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ రాజాబాబు.. ఇతర అధికారులు, టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలిసి బుధవారం పరిశీలించారు. కొత్తూరు, గంటవానిపల్లె గ్రామాలతోపాటు హెలిప్యాడ్, సభా ప్రాంగణం, ఫీడర్ కెనాల్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రత, ఇతరత్రా చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ పులి శ్రీనివాసులు, ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ శివరామిరెడ్డి, ప్రాజెక్టు ఎస్ఈ అబూతాలిమ్, డీఎస్పీ నాగరాజు, పీఆర్ ఏఈ సుబ్బారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, చంటి పాల్గొన్నారు.

# బయట కొనుగోళ్లు ప్రారంభం

## మేలు రకం పొగాకు క్వింటా రూ.26వేలు
## పెట్టుబడుల కోసం తెగనమ్ముకుంటున్న రైతులు



క్రైం కౌంటర్ న్యూస్ : కొండపి, ఫిబ్రవరి 18 : రైతులు వేలం కేంద్రాల వెలుపల ప్రైవేటు కంపెనీలు, చిరు వ్యాపారులకు పొగాకు అమ్మకాలు ప్రారంభించారు. ప్రధానంగా అధికంగా పంట సాగుచేసిన పెద్ద, చిన్నకారు రైతులు పొగాకును బయట విక్రయిస్తున్నారు. ఈఏడాది మొత్తంగా మేలు రకం దిగుబడి పెరిగింది. ఇప్పటికే లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టిన రైతులకు డబ్బులు అవసరం అవుతుండటంతో పొగాకును అమ్ముకుంటున్నారు. ప్రైవేటు వ్యాపారులు నాణ్యమైన పొగాకును క్వింటా రూ.26 వేలకు పది రోజుల క్రితం కొండపి, జరుగుమల్లి మండలాల్లో పలువురు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు తెలిసింది. తిరిగి వ్యాపారులు కర్ణాటక మార్కెట్‌ను చూసుకుని తగ్గించారని సమాచారం. ప్రస్తుతం గ్రేడింగ్ చేసిన అనంతరం నాణ్యమైన బ్రైట్ రకం పొగాకును క్వింటా రూ.23వేల నుంచి 24 వేల వరకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే టంగుటూరుకు చెందిన పలువురు ప్రైవేటు వ్యాపారులు కొండపి, జరుగుమల్లి, టంగుటూరు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన రైతుల నుంచి మధ్యవర్తుల ద్వారా వందల క్వింటాళ్ల పొగాకును కొనుగోలు చేశారని సమాచారం.

రూ.6వేలు ఆదా

ప్రైవేటుగా విక్రయించుకుంటున్న రైతులు లెక్కలు వేసుకుంటున్నారు. నాణ్యమైన పొగాకును కోల్డ్ స్టోరేజీలో భద్రపరిచేందుకు క్వింటాకు రూ.500 ఖర్చవుతుంది. వేలంకేంద్రంలో లైసెన్స్‌పై విక్రయిస్తే క్వింటాకు రూ.2వేల వరకు ఖర్చవుతుంది. ఇవి కాకుండా మూడు నెలల తర్వాత వచ్చే డబ్బులకు వడ్డీలు, ఇతర రవాణా ఖర్చులు మరో రూ.4వేల వరకు అవుతాయని రైతులు లెక్కలు వేసుకుంటున్నారు. ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తే వెంటనే డబ్బులు రావడంతోపాటు, ఇప్పుడు పెట్టుబడులకు, అత్యవసరాలకు నగదు అందుతుంది. వేలం కేంద్రాలు ప్రారంభయ్యేసరికి మరో నెలరోజులు పట్టే అవకాశం ఉందంటున్నారు. ఈ నేపథ్యంలో వేలం కేంద్రం వెలుపల పొగాకు అమ్మకాలు ఊపందుకున్నాయని తెలిసింది.

ప్రైవేటు అమ్మకాలు లేవు... ఐనా అమ్మకోవద్దు

జి.సునీల్‌కుమార్, కొండపి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి

కొండపి పొగాకు వేలం కేంద్రం పరిధిలో ప్రైవేటుగా పొగాకు కొనుగోళ్లు లేవు. అలా జరుగుతున్నట్లు నా దృష్టికి రాలేదు. ఎవరన్నా రైతులు వేలం కేంద్రం వెలుపల పొగాకును అమ్ముకుంటుంటే అటువంటి చర్యలకు పాల్పడవద్దు. వేలంకేంద్రం తెరిచాక అక్కడే పొగాకును లైసెన్స్‌పై విక్రయించుకోవాలి.

# మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తే అత్యాచారయత్నమే.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు

క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 18 మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, వారి అనుమతి లేకుండా శరీర భాగాలను తాకడం కేవలం వేధింపులు మాత్రమే కాదని, అది 'అత్యాచారయత్నం' కిందికే వస్తుందని దేశ అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. 11 ఏళ్ల బాలికపై జరిగిన అకృత్యానికి సంబంధించి గతంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. నిందితుడిపై ఉన్న తీవ్రమైన సెక్షన్లను తొలగించడం చెల్లదని, మహిళల గౌరవానికి భంగం కలిగించే ఏ చర్య అయినా కఠినమైన శిక్షకు అర్హమని ధర్మాసనం ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది.

గత ఏడాది అలహాబాద్ హైకోర్టు ఈ కేసులో నిందితుడికి ఊరటనిస్తూ, అతనిపై ఉన్న సెక్షన్ 376 (అత్యాచారం), సెక్షన్ 18 (నేరానికి ప్రయత్నించడం) వంటి ఆరోపణలను కొట్టివేసింది. కేవలం సాధారణ వేధింపులుగా పరిగణించి సెక్షన్లను మార్చాలని హైకోర్టు ఆదేశించింది. అయితే, ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు, కింది కోర్టు (స్పెషల్ జడ్జి) గతంలో జారీ చేసిన సమన్లను పునరుద్ధరించింది. చట్టం దృష్టిలో బాధితురాలి దుస్తులను లాగడం లేదా అసభ్యంగా తాకడం అనేవి చిన్న విషయాలు కావని తేల్చి చెప్పింది.

బాధితురాలి ప్రైవేట్ భాగాలను తాకడం, పైజామా లాగడం వంటి చర్యలు నేరస్థుడి దురుద్దేశాన్ని స్పష్టం చేస్తున్నాయని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఇటువంటి చర్యలు కేవలం లైంగిక వేధింపుల పరిధిలోకి రావని, అవి స్పష్టంగా అత్యాచార ప్రయత్నమేనని ధర్మాసనం వివరించింది. సమాజంలో మహిళల రక్షణ కోసం చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని, సాంకేతిక కారణాలతో నేరస్థులు తప్పించుకోకూడదని న్యాయమూర్తులు పేర్కొన్నారు. హైకోర్టు ఈ విషయంలో చట్టపరమైన లోతును గమనించడంలో విఫలమైందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ తీర్పు ద్వారా దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అకృత్యాల విషయంలో న్యాయ వ్యవస్థ తన కఠిన వైఖరిని చాటిచెప్పింది. ముఖ్యంగా మైనర్ బాలికల విషయంలో జరిగే ఇటువంటి నేరాలను ఉపేక్షించకూడదనే సందేశాన్ని సుప్రీంకోర్టు ఇచ్చింది. స్పెషల్ జడ్జి జారీ చేసిన సమన్ల ప్రకారం నిందితుడిపై విచారణ కొనసాగాలని ఆదేశించడమే కాకుండా, బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని సూచించింది. చట్టపరమైన లొసుగులను వాడుకుని నేరగాళ్లు తప్పించుకునే ప్రయత్నాలకు ఈ తీర్పు అడ్డుకట్ట వేయనుంది.

# చిట్టాతో బాబు.. విందు పేరుతో లోకేష్

## నేడు విద్యాశాఖ మంత్రి, రేపోమాపో సీఎం
## ఉమ్మడి జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలతో భేటీలు
## ఆ నలభై మందిలో జిల్లా నుంచి ఎవరు?
## లిక్కర్ కింగ్‌లపై ప్రత్యేక దృష్టి
## అరడజనుకుపైగా సర్వేలతో నివేదిక సిద్ధం



క్రైం కౌంటర్ న్యూస్ , ఫిబ్రవరి 18 ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల భేటీలు ప్రారంభమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని జిల్లాలకు సంబంధించి పూర్తయ్యాయి. చంద్రబాబు అరడజనుకుపైగా సర్వే సంస్థలతో తెప్పించుకున్న నివేదికల ఆధారంగా ఎమ్మెల్యేలతో నిర్మొహమాటంగా సమీక్ష చేస్తుండగా.. మంత్రి నారా లోకేష్ ఉల్లాసంగా, ఉత్సాహంగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గురువారం ఒంగోలు, బాపట్ల లోక్‌సభల పరిధిలోని ఇద్దరు ఎంపీలు, ఎమ్మెల్యేలతో భేటీ కానున్నారు. సీఎం చంద్రబాబు అందుబాటులో లేనందున ఆయనతో జరగాల్సిన సమావేశాలు రెండు, మూడు రోజులు వాయిదా పడ్డాయి. అయితే లోకేష్ మాత్రం గురువారం సాయంత్రం ఈ రెండు లోక్ సభలలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో భేటీ కానున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన వద్ద లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల వారీ ఉన్న నివేదికలతో సమావేశాల్లో సమీక్ష చేస్తున్నారు.

అందిన సమాచారం మేరకు ఇప్పటికే అరడజనుకుపైగా సంస్థలతో వేర్వేరుగా సమీక్షలు చేయించారు. ఆయా నియోజకవర్గాల వారీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు ఎలా ఉంది? వాటి విషయంలో సదరు ఎమ్మెల్యే పాత్ర ఎంత? అలాగే ప్రజలకు అందుబాటులో ఉంటున్నారా.. పార్టీశ్రేణులతో సమన్వయంతో నడుస్తున్నారా? వారిని గౌరవిస్తున్నారా? ఆదాయ వనరుల విషయంలో చట్టబద్ధంగా వ్యవహరిస్తున్నారా? ఇత్యాధి అంశాలపై సర్వే జరిగినట్లు తెలుస్తోంది. అలాగే ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య, మంత్రులు, నాయకులు, అధికారులు మధ్య, సమన్వయం ఎలా ఉందన్న విషయంపై కూడా సర్వే జరిగినట్లు సమాచారం. తద్వారా రూపొందించిన నివేదికలను దగ్గర బెట్టుకుని సీఎం మాట్లాడుతున్నారు. దీంతో చంద్రబాబునాయుడు సమీక్ష ఎలా ఉండబోతుందన్న ఆందోళన అందరిలోనూ ఆరంభమైంది.

# గణనీయంగా పెరిగిన సామాజికవనాల సాగు

## నాలుగేళ్లలో పదిరెట్లు అయిన విస్తీర్ణం
## మాగాణి, రేగడి భూముల్లోనూ తోటలు
## నేలచూపులు చూస్తున్న జామాయిల్ ధరలు
## ప్లైవుడ్ పరిశ్రమలే ఆధారంగా విక్రయాలు
## పేపరు పరిశ్రమ ఏర్పాటుకు కృషి జరిగేనా?




క్రైం కౌంటర్ న్యూస్ : కందుకూరు, ఫిబ్రవరి 18 జిల్లాలో మళ్లీ సామాజికవనాల సాగు పెరిగిపోతోంది. గతంలో ధరలు లేక వెనకడుగు వేసిన రైతులు ప్రస్తుతం మిగతా పంటల సాగు ఆశాజనకంగా లేకపోవడంతో జామాయిల్ బాట పట్టారు. కందుకూరు ప్రాంతంలో ఏడాదికి రెండు పంటలు పండిచేందుకు అనువుగా నీటి వసతి ఉన్న మాగాణి భూములతోపాటు శనగ, పొగాకు సాగుకు పెట్టింది పేరుగా భావించే నల్లరేగడి నేలల్లోనూ విపరీతంగా జామాయిల్ మొక్కలు నాటారు. ప్రసిద్ధిగాంచిన అత్తాకోడళ్ల చెరువుల ఆయకట్టులో 60 శాతానికిపైగా ఈ తోటలే ఉన్నాయి. రాళ్లపాడు రిజర్వాయరు ఆయకట్టులోని అనేక గ్రామాలో ఇదే పరిస్థితి. అలాగే కందుకూరు, కొండపి నియోజకవర్గాల పరి?ధిలో జామాయిల్ తోటలు దర్శనం ఇస్తున్నాయి. మామాడి, సపోటా లాంటి పండ్లతోటలు కూడా తీసేసి సాగు చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కేవలం కందుకూరు నియోజకవర్గంలోనే 70వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు ఉన్నట్లు అంచనా.

వ్యాపారుల మాయాజాలంతో వేలంవెర్రి

సాగు విస్తీర్ణం పెరిగిందో లేదోకర్ర ధర నేల చూపులు చూస్తోంది. స్థానికంగా పేపరు పరిశ్రమలే కాక పల్ప్, ప్లైవుడ్ పరిశ్రమలు లేకపోవడమే దీనికి ప్రధానకారణమైంది. గతంలో పేపర్ తయారీ పరిశ్రమలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. వారి డిమాండ్‌కు తగ్గట్లు జామాయిల్ కర్ర దొరకక రేట్లు పెంచేశారు. గత సంవత్సరం తాటతీసిన జామాయిల్ కర్ర టన్నుకు రూ.7,800 వరకు రైతుకు చెల్లించారు. అంతకుముందు ఏడాది కూడా ఇదే పరిస్థితి ఉంది. అయితే ప్రస్తుతం కర్ర లభ్యత పెరిగింది. మూ డేళ్ల క్రితం నాటిన మొక్కలు ఇప్పుడు కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఇదేఅదనుగా వ్యాపారులు ఆరు నెల నుంచి క్రమేపీ ధర తగ్గిస్తూ వచ్చారు. ప్రస్తుతం టన్ను రూ.6,500 నుంచి రూ.6,600 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మరో రెండేళ్లు కర్ర లభ్యత పెరిగే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో ఈ ధరను మరింత దిగ్గోసే ప్రమాదం లేకపోలేదు.

రైతుల్లో ఆందోళన

జిల్లా నుంచి ప్రధానంగా భద్రాచలం పేపరు మిల్లుకు జామాయిల్ ఎగుమతి అవుతోంది. కందుకూరు మండలంలోని కోవూరు, కడప జిల్లా బద్వేలు, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలలో ఉన్న ప్లైవుడ్ పరిశ్రమలకు ఇక్కడి నుంచి కర్ర తరలుతోంది. అడపాదడపా కాగజ్‌నగర్, కర్ణాటకలోని ఒకటి రెండు పేపరు పరిశ్రమలకు కూడా కర్ర తరలుతోంది. అయితే వ్యాపారులంతా కూడబలుక్కుని ధరను దిగజారుస్తున్న పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇదే ఒరవడి కొనసాగితే పదేళ్ల క్రితం నాటి పరిస్థితులు పునరావృతం అవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ గిట్టుబాటు ధరల కోసం ఆందోళనబాట పట్టక తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒక్కసారి సాగు చేస్తే కనీసం పన్నెండేళ్ల నుంచి ఇరవై సంవత్సరాల వరకు తీసేయటానికి వీలుకాని దీర్ఘకాల పంట కావడంతో ఇప్పుడే ఇలా ఉంటే తమ భవిష్యత్తు ఏమిటన్న ఆందోళన రైతుల్లో ప్రారంభమైంది.

పేపరు పరిశ్రమ ఏర్పాటుచేసేనా?

ఒకప్పుడు జామాయిల్‌కు గిట్టుబాటు ధర లభించేలా చూడటమే లక్ష్యంగా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా భారీ పేపరు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేసింది. మల్టీనేషనల్ కంపెనీ అయిన ఏషియన్ పల్ప్ అండ్ పేపరు (ఏపీపీ) పరిశ్రమ రమారమి రూ.3వేల కోట్ల పెట్టుబడితో రామాయపట్నం పరిసరాల్లో ఏర్పాటుకు ముందుకొచ్చింది. రాష్ట్రప్రభుత్వంతో ఎంవోయూ చేసుకుంది. 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా ఏపీపీకి శంకుస్థాపన కూడా చేశారు. అనంతరం రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అనేక పరిశ్రమలు తరలిపోయినట్లే ఏపీపీ ప్రతినిధులు కూడా ఇక్కడ పరిశ్రమ ఆలోచనను విరమించుకున్నారు. దీంతో రైతులకు తీరని అన్యాయం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తిరిగి అధికారంలో ఉన్న ప్రజాప్రభుత్వమైనా పేపరు పరిశ్రమ ఏర్పాటు ఆలోచనను మళ్లీ కార్యరూపంలోకి తేవాలని రైతులు కోరుకుంటున్నారు.

దూరాభారంతో సమస్య

ప్రకాశం జిల్లాలో లక్షలాది ఎకరాల్లో జామాయిల్ ఉండటంతోపాటు పొరుగునే ఉన్న నెల్లూరు జిల్లాలో కూడా పెద్దఎత్తున సుబాబుల్, సరుగుడు సాగు విస్తీర్ణం ఉంది. ఈ రెండు జిల్లాల సరిహద్దులో పేపరు పరిశ్రమ ఏర్పాటు ఆవశ్యకత ఎంతో ఉందని రైతులు పేర్కొంటున్నారు. జామాయిల్ ముడిసరుకు అంతా ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో ఉండగా పరిశ్రమలు మాత్రం సుదూరంగా ఉన్న కారణంతో రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని తెలుస్తోంది. టన్నుకు రూ.2వేలు వరకు రవాణా చార్జీలే అవుతున్నాయి. దీంతో దగ్గర్లో పరిశ్రమ లేని కారణంగా వ్యాపారుల మాయాజాలం కారణంగా రైతులు దోపిడీకి గురవుతున్న పరిస్థితి. ఈ స్థితిలో రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా పేపరు పరిశ్రమ ఏర్పాటుకు ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు కృషిచేయాల్సి ఉంది. ఏపీపీతో చేసుకున్న ఒప్పందం మేరకు ఈ సంస్థ ప్రతినిధులు రంగంలోకి దిగి పరిశ్రమ ఏర్పాటుచేసేలా ప్రభుత్వంలోని పెద్దలు కృషిచేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో మరో సంస్థ ద్వారానైనా ఈ ప్రాంతంలో పేపరు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

# బంగారు కడ్డీల పేరుతో రూ.15 లక్షల దోపిడీ

క్రైం కౌంటర్ న్యూస్ : చౌడేపల్లె, ఫిబ్రవరి18 తక్కువ ధరకు బంగారు కడ్డీలు ఇస్తామని చెప్పి మట్టి, రాళ్లు చేతిలో పెట్టి రూ.15లక్షలు దోచుకెళ్లిన ఘటన చౌడేపల్లె మండలంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ తాలుకా సాగర్ టౌన్‌కు చెందిన విజయ్ కుమారుడు రాజేష్ ట్యాక్సీ నడుపుకుంటు జీవిస్తున్నాడు. ఆతని ఇంటి సమీపంలో అద్దెకు ఉన్న ఓ జేసీబీ డ్రైవరు తనకు తెలిసిన వ్యక్తుల వద్ద 5 కిలోల బంగారు కడ్డీలు ఉన్నాయని, వారికి డబ్బులు అవసరం ఉందని తక్కువకే తీసిస్తానని నమ్మబలికాడు. కిలో బంగారు రూ.7 లక్షలకు ఇస్తారని ఆశ చూపాడు. కావాలంటే పరిక్షించుకోమని ఒక బంగారు కడ్డీని రాజేష్‌కు ఇచ్చాడు. రాజేష్ బంగారు అంగడిలో పరీక్ష చేయించగా ఒరిజనల్ బంగారమనే చెప్పారు. 5 కిలోల బంగారు మదనపల్లెలో ఇస్తామని, అడ్వాన్స్‌గా రూ.15 లక్షలు ఇవ్వాలని జేసీబీ డ్రైవర్ కోరాడు. రాజేష్ తన భార్యతో కలిసి రూ.15 లక్షల నగదు తీసుకుని మదనపల్లెకు వచ్చాడు. అయితే చిన్నారి హత్యాచారం ఘటన నేపథ్యంలో మదనపల్లెలో బందోబస్తు ఎక్కువగా ఉందని, చౌడేపల్లె-పుంగనూరు మార్గంలోని లద్దిగం వద్దకు రావాలని చెప్పడంతో అక్కడకు వెళ్లారు. దుండగులు 3 ద్విచక్ర వాహనాల్లో ఆరుగురు వచ్చారు. లద్దిగం సమీపంలోని చింతతోపు వద్ద రూ.15 లక్షలు తీసుకుని, అతనికి 2 కిలోల రాళ్లు, 3 కిలోల మట్టి ఇచ్చారు. పోలీసులు వెంబడిస్తున్నారని చెప్పి రాజేష్ వద్ద ఉన్న సెల్ ఫోన్ సైతం లాక్కుని అక్కడి నుంచి ద్విచక్ర వాహనాల్లో ఉడాయించారు. పోలీసులు వస్తున్నారనే భయంతో రాజేష్ కూడా హడావుడిగా పుంగనూరుకు కారులో వెళ్లారు. అక్కడ వారు ఇచ్చిన మూటలను విప్పి చూడగా రాళ్లు, మట్టి కనిపించడంతో అవాక్కయ్యారు. మోసపోయినట్లు గుర్తించి ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# సినిమా



## జగపతిబాబు కామెంట్స్ వైరల్

టాలీవుడ్ వెండితెరపై జగపతిబాబు, సౌందర్య లది సూపర్ హిట్ జోడీ. వీరి కాంబినేషన్ లో పలు సూపర్ హిట్ సినిమాలు వచ్చాయి. ముఖ్యంగా ఈ జోడీ నటించిన సినిమాలు ఫ్యామిలీ ఆడియెన్స్ కు తెగ నచ్చేశాయి. పెళ్లి పీటలు, ప్రియరాగాలు, సర్దుకుపోదాం రండి, దొంగాట, అంతఃపురం.. ఇలా ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో కలిసి నటించారు సౌందర్య, జగ్గూబాయ్. సినిమాల్లోనే కాదు ఆఫ్ స్క్రీన్ లోనూ ఈ ఇద్దరికీ మంచి స్నేహం ఉండేది. ఈ నేపథ్యంలో సౌందర్యతో తనకున్న అనుబంధాన్ని ఇప్పటికే పలు సందర్భాల్లో పంచుకున్నారు జగ్గూభాయ్. అయితే సౌందర్యతో పాటు ఆమె సోదరుడు అమర్నాథ్ కూడా జగపతిబాబుకు మంచి స్నేహితుడట. ఆ స్నేహం వల్లే వీరి కుటుంబాల మధ్య కూడా మంచి అనుబంధం ఏర్పడిందట. ఈ విషయాన్ని స్వయంగా జగ్గూభాయే ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. అదే సమయంలో హెలికాప్టర్ ప్రమాదంలో సౌందర్య, అమర్నాథ్ చనిపోయినప్పటి చేదు జ్ఞాపకాలను ఓ సందర్భంలో షేర్ చేసుకున్నారు.

2004లో జరిగిన ఓ హెలికాప్టర్ ప్రమాదంలో సౌందర్యతో పాటు ఆమె సోదరుడు అమర్నాథ్ కూడా కన్నుమూసిన సంగతి తెలిసిందే. దీని గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన జగపతిబాబు.. ' ఆరోజు నాకు ఫోన్ వచ్చింది.. సౌందర్య చనిపోయిందని చెప్పారు. ఆ సమయంలో నేను విదేశాల్లో ఉన్నాను. వెంటనే నేను అమర్ (సౌందర్య సోదరుడు) ఎలా ఉన్నాడు అని అడిగాను. అతనికి ఏమైనా జరిగితే మాత్రం నాకు చెప్పొద్దు అని వెంటనే ఫోన్ పెట్టేశాను. కానీ విధి చాలా బలీయమైనది, ఆ ప్రమాదంలో సౌందర్యతో పాటు అమర్‌నాథ్ కూడా ప్రాణాలు కోల్పోయారు. ప్రాణ స్నేహితుడిని కోల్పోవడం తనను సగం చంపేసినంత పని చేసింది' అని జగపతిబాబు ఎమోషనల్ అయ్యారు.

కాగా ప్రస్తుతం సౌందర్య తల్లితో కానీ, ఆమె కుటుంబ సభ్యులతో తాను టచ్‌లో లేనని నటుడు జగపతి బాబు తెలిపారు. అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు చాలా మారిపోయాయని ఆయన అన్నారు. అయితే సౌందర్య తల్లి ప్రస్తుత పరిస్థితి గురించి నేరుగా తెలియకపోయినా, ఆమె బాగానే ఉన్నారని విన్నానని జగ్గూభాయ్ చెప్పారు. గతంలో వారి కుటుంబంలో ఆస్తి సంబంధిత సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయని, అయితే అవి ఇప్పుడు పరిష్కారమయ్యాయని తాను విన్నానని జగపతి బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం సౌందర్యతో ఆమె ఫ్యామిలీపై ఈ సీనియర్ నటుడు చేసిన కామెంట్స్ నెట్టింట బాగా వైరలవుతున్నాయి.





## భోజనం తర్వాత హోటళ్లలో సోంపు ఎందుకు ఇస్తారో తెలుసా?

భోజనం తర్వాత సోంపు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు లెక్కకు మించి ఉన్నాయి. జీర్ణక్రియను మెరుగుపరచడం నుంచి రక్త ప్రసరణ, కంటి ఆరోగ్యం వరకు సోంపు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అందుకు ప్రతి ఇంటి వంట గదిలో ఇది తప్పక ఉంటుంది. అలాగే హోటళ్లలో భోజనం తర్వాత ప్లేట్‌లో సోంపు, చక్కెర వడ్డిస్తారు. ఇది కేవలం ఆతిథ్య మర్యాద మాత్రమే కాదు, దీని వెనుక గొప్ప ఆరోగ్య శాస్త్రం ఉంది. చాలా మంది దీనిని కేవలం నోరు శుభ్రం చేసుకునేందుకు ఉపయోగపడే పదార్థంగా భావిస్తారు. కానీ సోంపు ఔషధ గుణాల నిధి. సోంపులో ఉండే సహజ నూనెలు కడుపులో జీర్ణ రసాల స్రావాన్ని పెంచడంలో సహాయపడతాయి. ఇది ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. మీరు అజీర్ణం, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతుంటే భోజనం తర్వాత కొంచెం సోంపు తినడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.అలాగే భోజనం తిన్న తర్వాత నోటిలో బ్యాక్టీరియా పేరుకుపోతుంది. దీనివల్ల దుర్వాసన వస్తుంది. మెంతులలోని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఈ క్రిములను చంపుతాయి. ఇది శ్వాసను తాజాగా ఉంచడంలో కూడా సహాయపడుతుంది. నేటి వేగవంతమైన జీవితంలో అసిడిటీ సమస్య సర్వసాధారణంగా మారింది. శరీరంలో పిత్తాన్ని తగ్గించడానికి సోంపు సహాయపడుతుంది. తరచుగా గుండెల్లో మంటతో బాధపడేవారికి, సోంపు తినడం సహజమైన, ప్రభావవంతమైన నివారణ అని నిపుణులు సూచిస్తున్నారు.

సోంపులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. దీనిలోని విటమిన్ ఎ కంటి దృష్టిని మెరుగుపరచడానికి సహజ పోషకంగా పరిగణించబడుతుంది. సోంపు శరీరం నుంచి విషపూరిత అంశాలను తొలగించడం ద్వారా రక్తాన్ని శుద్ధి చేయడానికి కూడా పనిచేస్తుంది. ఇది చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. సోంపు రుచికి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా మంచిది. అందుకే భోజనం తర్వాత మీ రోజువారీ అలవాట్లలో సోంపు చేర్చుకోవడం వల్ల సత్ఫలితాలను పొందవచ్చు.



## అమ్మబాబోయ్.. పెద్ద కథే ఉందిగా..

చికెన్ అంటే చాలు.. నాన్‌వెజ్ ప్రియులు లొట్టలేసుకుంటూ మరి తింటారు.. చికెన్ ఫ్రై, కర్రీ, తందూరి, చికెన్ పచ్చడి.. ఇలా ఎన్నో రకాలుగా చేసుకుని ఇష్టంగా తింటారు. అయితే.. కొందరికి ముక్క లేనిదే ముద్ద దిగదు.. అవును.. చాలా మంది డైలీ నాన్ వెజ్ తినడాన్ని ఇష్టపడతారు.. ఇక కొందరైతే డైలీ చికెన్ ను తింటారు.. చికెన్ లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. మంచి ప్రోటీన్ వనరుగా కోడి మాంసం గుర్తింపు పొందింది.. అయితే ప్రతిరోజూ చికెన్ తినడం ఆరోగ్యకరమేనా అనే సందేహం చాలామందిలో ఉంటుంది. డైటీషియన్ల ప్రకారం.. చికెన్ మంచిదే అయినప్పటికీ, దానిని ప్రతిరోజూ తీసుకోవడం సరికాదని సూచించారు. వారానికి ఒకటి లేదా రెండుసార్లు, లేదా గరిష్టంగా మూడుసార్లు మాత్రమే తీసుకోవడం ఆరోగ్యానికి ప్రయోజనకరమని పేర్కొంటున్నారు.చికెన్‌లో ప్రధానంగా రెండు రకాలు ఉన్నాయి: దేశీ చికెన్ (నాటు కోడి), బాయిలర్ చికెన్. పోషకపరంగా దేశీ చికెన్‌కే ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంటున్నారు. దేశీ చికెన్‌లో ప్రోటీన్ కంటెంట్ బాయిలర్ చికెన్ కంటే అధికంగా ఉంటుంది. ఉదాహరణకు, దేశీ చికెన్‌లో 100 గ్రాముల ప్రోటీన్ లభిస్తే, బాయిలర్ చికెన్‌లో కేవలం 50-60 గ్రాముల వరకు మాత్రమే లభించే అవకాశం ఉంది. అధిక ప్రోటీన్ కలిగిన దేశీ చికెన్ శరీరాన్ని బలోపేతం చేయడానికి, వెన్నెముకకు మద్దతు ఇవ్వడానికి సహాయపడుతుంది. అయితే.. బ్రాయిలర్ చికెన్ తో పోలిస్తే.. దేశీ చికెన్ ధర ఎక్కువగా ఉంటుంది. ఇటు ఆర్థికంగా.. అటు శరీర అవసరాలకు అనుగుణంగా చికెన్ ను ఎంచుకోవడం ఉత్తమం..

చికెన్ తయారీ పద్ధతి కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. రోటీ, ఉడకబెట్టిన, గ్రిల్డ్ లేదా తందూరి చికెన్ వంటివి తీసుకోవచ్చు.. కానీ అధికంగా మసాలాలు వాడకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చికెన్ వండేటప్పుడు రుచి, వాసన కోసం చాలామంది మసాలాలను అధికంగా ఉపయోగిస్తారు. అయితే, ఈ మసాలాలు క్యాన్సర్ కణాల పెరుగుదలకు దారితీయవచ్చని, క్యాన్సర్ లేనివారిలో కూడా దీనికి అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదాన్ని నివారించడానికి, రుచి కోసం ఇంట్లో తయారుచేసిన ధనియాల పొడి, మిరియాల పొడి, కరివేపాకు పొడి వంటి సహజ మసాలాలను ఉపయోగించవచ్చు.. బయట లభించే ప్యాక్డ్ మసాలాలను వీలైనంతవరకు తగ్గించడం మంచిది.ప్రతిరోజూ చికెన్ తింటే ఏమవుతుంది..

ప్రతిరోజూ చికెన్ తినడం వల్ల శరీరం దానిని భరించలేకపోవచ్చు.. జీర్ణక్రియ సమస్యలు తలెత్తవచ్చు. కొందరు "చికెన్ తింటే వేడి చేస్తుంది" లేదా "పడట్లేదు" అని చెబుతుంటారు. దీనికి కారణం తరచుగా అధిక మసాలాలు, నూనెతో కూడిన వంటకాలు లేదా రోజువారీ తీసుకోవడమేనని నిపుణులు పేర్కొంటున్నారు.. అధికంగా తీసుకుంటే జీర్ణం కాకపోవడమే కాకుండా, చికెన్‌పై ఆసక్తి కూడా తగ్గిపోతుంది.

## ట్వంటీ20 వరల్డ్ కప్.

టీ20 వరల్డ్ కప్ 2026లో గ్రూప్ స్టేజ్ చివరి అంకానికి చేరుకుంది. ఇప్పటికే వరుసగా మూడు విజయాలతో అజేయంగా నిలిచి, సూపర్-8 బెర్తును ఖరారు చేసుకున్న టీమిండియా.. బుధవారం తన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో తలపడుతోంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ పోరులో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. సూపర్-8లో సౌతాఫ్రికా వంటి బలమైన జట్టుతో తలపడనున్న నేపథ్యంలో ఈ మ్యాచ్‌ను భారత్ ఒక ప్రాక్టీస్ సెషన్‌లా భావిస్తోంది. మరోవైపు ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన నెదర్లాండ్స్.. పటిష్టమైన భారత్‌ను ఓడించి గౌరవప్రదంగా ఇంటికి వెళ్లాలని చూస్తోంది.ఈ మ్యాచ్ ముఖ్యంగా టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మకు చావోరేవో లాంటిది. ఈ వరల్డ్ కప్‌లో ఇప్పటివరకు ఆడిన మ్యాచ్‌ల్లో అతను ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. పాకిస్థాన్, అమెరికా వంటి జట్లతో జరిగిన కీలక పోరుల్లో అభిషేక్ కనీసం ఖాతా తెరవకుండానే (డకౌట్) పెవిలియన్ చేరాడు. సూపర్-8లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలంటే నెదర్లాండ్స్‌పై భారీ స్కోరు సాధించడం అతనికి ఎంతో ముఖ్యం. అహ్మదాబాద్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది కాబట్టి, అభిషేక్ తన పాత ఫామ్‌ను అందిపుచ్చుకుంటాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా ఫీల్డింగ్‌లో ఒక అరుదైన రికార్డుకు చేరువలో ఉన్నాడు. టీ20ల్లో అత్యధిక క్యాచ్‌లు పట్టిన భారతీయుడిగా రోహిత్ శర్మ (65 క్యాచ్‌లు) పేరిట ఉన్న రికార్డును అధిగమించేందుకు హార్దిక్ (63 క్యాచ్‌లు)కు మరో మూడు క్యాచ్‌లు మాత్రమే అవసరం. చరిత్ర పరంగా చూస్తే భారత్ నెదర్లాండ్స్ జట్లు అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటివరకు నాలుగు సార్లు తలపడగా.. ఆ నాలుగు సార్లూ టీమిండియానే విజయం వరించింది. 100 శాతం విన్నింగ్ రికార్డుతో ఉన్న భారత్, ఈ మ్యాచ్‌లోనూ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. అహ్మదాబాద్ స్టేడియంలో భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉన్నందున, అభిమానులకు పరుగుల విందు ఖాయమనిపిస్తోంది. సూపర్-8 రౌండ్‌కు వెళ్లే ముందు భారత్ తన విజయ పరంపరను ఇలాగే కొనసాగించాలని పట్టుదలగా ఉంది.




## సాహిబ్‌జాదా ఫర్హాన్ ఊచకోత.

టీ20 వరల్డ్ కప్ 2026లో పాకిస్థాన్ జట్టు ఎట్టకేలకు ఊపిరి పీల్చుకుంది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో నమీబియాపై 102 పరుగుల భారీ విజయంతో ఘనంగా సూపర్-8 రౌండ్‌లోకి దూసుకెళ్లింది. కొలంబో వేదికగా జరిగిన ఈ పోరులో పాక్ బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా రాణించి పసికూనను మట్టికరిపించారు. ఈ గెలుపుతో ఈ మెగా టోర్నీలో సూపర్-8కు చేరిన ఎనిమిదో, ఆఖరి జట్టుగా పాకిస్థాన్ నిలిచింది. ఇప్పటికే భారత్, జింబాబ్వే సహా ఏడు జట్లు తదుపరి రౌండ్‌కు చేరుకోగా, ఇప్పుడు పాక్ కూడా ఆ జాబితాలో చేరింది.

ఈ మ్యాచ్‌లో పాక్ విజయంలో ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ హీరోగా నిలిచాడు. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే నమీబియా బౌలర్లపై విరుచుకుపడ్డ ఫర్హాన్.. కేవలం 58 బంతుల్లోనే 100 పరుగులు చేసి సెంచరీ మార్కును అందుకున్నాడు. అతనికి తోడుగా కెప్టెన్ సల్మాన్ ఆగా 38 పరుగులతో రాణించగా, ఆఖర్లో షాదాబ్ ఖాన్ కేవలం 22 బంతుల్లోనే 1 ఫోర్, 3 సిక్సర్లతో 36 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 199 పరుగుల భారీ స్కోరు సాధించింది.

అనంతరం 200 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నమీబియాకు పాక్ బౌలర్లు చుక్కలు చూపించారు. ఆది నుంచే వికెట్లు కోల్పోతూ వచ్చిన నమీబియా జట్టు ఏ దశలోనూ పాక్‌కు పోటీ ఇవ్వలేకపోయింది. పాక్ బౌలర్ల ధాటికి నమీబియా కేవలం 97 పరుగులకే కుప్పకూలింది. దీంతో పాక్ 102 పరుగుల భారీ తేడాతో విజయాన్ని అందుకుని టోర్నీలో తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. ఈ విజయంతో పాక్ అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు.పాకిస్థాన్ సూపర్-8కు క్వాలిఫై అవ్వడంతో ఇప్పుడు మరోసారి భారత్ -- పాక్ హైవోల్టేజ్ పోరుకు రంగం సిద్ధమైంది. గ్రూప్ దశలో భారత్ చేతిలో ఓడిపోయిన పాకిస్థాన్, ఇప్పుడు సూపర్-8లో ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తోంది. ఈ నెగ్గుకు రావడంతో టోర్నీలో అసలు సిసలు మజా మొదలైందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com